# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 217
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
మే 28, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## మృదు స్వభావి.. మురళీధర్ రెడ్డి

- యువ అధికారులకు స్ఫూర్తి ప్రదాత
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బహుముఖ సేవలు
- సంఘ సేవకుడే కాదు.. మంచి సంస్కర్త
- టీఎన్జీఓ, టీజీఓలో కీలక పాత్ర
- గెజిటెడ్ అధికారుల సమస్యల సాధనకు కృషి
- 29న ఆత్మీయ సన్మానం
- 31న ఉద్యోగ విరమణ

7లో..



# భద్రకాళి చెరువులో.. ఐలాండ్స్



వివరాలు2లో..



చారిత్రక ఓరుగల్లులోని భద్రకాళీ చెరువులో ఐలాండ్స్ ను ఏర్పాటు చేసేందుకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ సూత్ర ప్రాయంగా అంగీకరించింది. ఇప్పటికే భద్రకాళి ఆలయాన్ని టూరిజం సర్క్యూట్ గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో చెరువు మధ్యలో ఐదు ఐలాండ్స్ ఏర్పాటు చేసి భద్రకాళి బండ్ కు అనుసంధానించడం ద్వారా ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భద్రకాళి చెరువులో గతంలో నీరు పూర్తిగా ఇంకిపోయిన సమయంలోనే ఐలాండ్ ఏర్పాటు చేయాలని 'కుడా' అధికారులు నిర్ణయించారు. ఇందుకు గాను రూ.2 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. తర్వాత భారీ వర్షాల కారణంగా చెరువు నిండిపోగా ఐలాండ్ ప్రతిపాదన అడుగున పడిపోయింది. ప్రస్తుతం పూడిక తీతలో భాగంగా చెరువు ఖాళీ చేయడంతో మరో మారు ఐలాండ్స్ ప్రతిపాదన తెరమీదికి వచ్చింది. ఇందుకు 'కుడా' సుముఖత వ్యక్తం చేయడంతో పనులు చురుకుగా సాగుతున్నాయి. అయితే ఐలాండ్స్ ఏర్పాటుపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తుండగా సామాజిక వేత్తలు మాత్రం ఆందోళనకు సిద్ధపడుతున్నారు. – వరంగల్ వాయిస్ ప్రతినిధి

- బండ్‌కు అనుసంధానించేలా నిర్ణయం
- సుందరీకరణలో భాగంగా ఏర్పాటు
- భద్రకాళి ఆలయాన్ని టూరిజం సర్క్యూట్ గా తీర్చిదిద్దే ఆలోచన
- సంతోషం వ్యక్తం చేస్తున్న భక్తులు
- ఆందోళనకు సిద్ధపడుతున్న సామాజిక వేత్తలు



8లో..

## శుభపరిణామం

- మేడిగడ్డ మరమ్మత్తులకు ప్రభుత్వం నిర్ణయం
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

## వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్

- నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య



8లో..



8లో..

## 'పశ్చిమ'కు మరో మణిహారం

- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం
- జీఓ విడుదల చేసిన ప్రభుత్వం
- ఏతుల ప్రభుత్వానికి చేతల ప్రభుత్వానికి తేడా సుస్పష్టం
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- సీఎం, డిప్యూటీ సీఎం చిత్ర పటాలకు క్షీరాభిషేకం

# భద్రకాళి చెరువులో.. ఐలాండ్స్



- బండ్ కు అనుసంధానించేలా నిర్ణయం
- సుందరీకరణలో భాగంగా ఏర్పాటు
- భద్రకాళి ఆలయాన్ని టూరిజం సర్క్యూట్ గా తీర్చిదిద్దే ఆలోచన
- సంతోషం వ్యక్తం చేస్తున్న భక్తులు
- ఆందోళనకు సిద్ధపడుతున్న సామాజిక వేత్తలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** పూడికతీతలో భాగంగా భద్రకాళి చెరువును పూర్తిగా ఖాళీ చేసిన నేపథ్యంలో చెరువు మధ్యలో ద్వీప స్వరూపం బయటకొచ్చింది. దీంతో ఇక్కడ ఐలాండ్స్ ఏర్పాటు చేయడంద్వారా మరింత ప్రయోజనం పొందవచ్చని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే చెరువుకు రెండు వైపులా భద్రకాళి బండ్ నిర్మాణం పూర్తి దశకు చేరుకోవడంతోపాటు మరోవైపున్న ఆలయ కట్టను కూడా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అదే విధంగా భద్రకాళి ఆలయాన్ని టూరిజం సర్క్యూట్ గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో చెరువు మధ్యలో ఐలాండ్ ఏర్పాటు చేసి, భద్రకాళి బండ్ కు అనుసంధానించడం ద్వారా పర్యాటకులను మరింత ఆకర్షించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### గతంలోనే ప్రతిపాదన..

15 సంవత్సరాల క్రితం భద్రకాళి చెరువులోని నీరు పూర్తిగా ఇంకిపోవడంతో ద్వీపం స్వరూపం బయట పడింది. చుట్టూ నీరు ఉండి మధ్యలో ఒక కొండ ఆకారంలో ఉన్న ఈ ప్రాంతాన్ని గమనించిన అప్పటి అధికారులు దీన్ని ఐలాండ్ గా తీర్చిదిద్దాలని భావించారు. దీంతో ఆ దిబ్బను పూర్తిగా శుభ్రం చేశారు. అక్కడ కొంత తవ్వకాలు చేపట్టగా.. కొన్ని



ప్రాచీన శిల్పాలు బయట పడ్డాయి. అంతేగాకుండా ఇక్కడ ఆదిమానవుల ఆనవాళ్లు కూడా ఉన్నాయని చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. ఇక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు దిబ్బను ద్వీపంగా మార్చవచ్చన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ఈ ప్రాంతం ధ్యాన మందిరం నిర్మాణానికి అనువుగా ఉందని నిర్ధారణకు వచ్చారు. అనంతరం కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఐలాండ్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేశారు. సుమారు రూ.2 కోట్ల నిధులతో డీపీఏ కూడా తయారు చేశారు. ఆ తర్వాత భారీ వర్షాలు కురవడంతో చెరువు నీటితో పూర్తిగా నిండిపోయింది. దీంతో ఐలాండ్ డెవలప్ మెంట్ ప్రతిపాదన కాలగర్భంలో కలిసిపోయింది.

### మళ్లీ తెరపైకి..

సుందరీకరణ కోసం చెరువును ఖాళీ చేయడంతో మరోసారి ఐలాండ్ ఏర్పాటు ప్రతిపాదన తెరమీదికి వచ్చింది. కాగా ఇప్పటికే ఆ చెరువుకు రెండు వైపులా భద్రకాళి బండ్ ఏర్పాటవుతుండగా.. మరోవైపున్న ఆలయ కట్టను కూడా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలోనే 350 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న భద్రకాళి చెరువులో ఐదు ఐలాండ్ లను ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవచ్చన అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ మేరకు 'కుడా' అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. చెరువులోని ఐదు ప్రాంతాలను గుర్తించి కట్టలుగా పోశారు. ఐలాండ్ లో ధ్యాన్యం మందిరం నిర్మిస్తే లక్నవరాన్ని మించిన పర్యాటక ప్రాంతంగా వెలుగొందుతుందని స్థానికులు, పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం కూడా గతంలో రూపొందించిన డీపీఆర్ ను ప్రస్తుత అవసరాలు, ఆలోచనలకు తగ్గట్టుగా సవరించే ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది.

### సామాజిక వేత్తల ఆగ్రహం..

భద్రకాళి చెరువును సుందరీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా భద్రకాళి చెరువులో ఐలాండ్స్ అభివృద్ధికి కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ప్రణాళికలు రచించింది. అయితే చారిత్రక ఓరుగల్లులోని భద్రకాళీ చెరువు పూడికతీత పేరుతో ఐలాండ్స్ నిర్మించడం ద్వారా చెరువు విస్తీర్ణం తగ్గిపోయే అవకాశం ఉందని సామాజిక వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఐలాండ్ ఐదునుంచి పది ఎకరాల వరకు విస్తరించి ఉండడం ద్వారా మొత్తం ఐదు ఐలాండ్ లకు 40నుంచి 50 ఎకరాల చెరువు విస్తీర్ణం తగ్గుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు విస్తీర్ణం తగ్గడంతో నీటి నిలువ సామర్థ్యం కూడా తగ్గుతుందని, దీని ద్వారా భవిష్యత్ తరాలకు నీటి లభ్యత కష్టంగా మారుతుందంటున్నారు.



## రైతులు అధైర్యపడొద్దు

**వరంగల్ వాయిస్, ఖానాపూర్/ పర్వతగిరి :** రైతులు అధైర్యపడొద్దని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద హామీ ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోళ్లు, రవాణా వేగవంతం చేయాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలోని పెద్దమ్మ గడ్డ, మనుబోతుల గడ్డ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, పర్వతగిరి మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ కౌసల్య దేవి, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా పౌర సరఫరాల ఆధికారి కిష్టయ్య, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహశీల్దార్లు, మహిళా సంఘాల ప్రతినిధులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

### అధికారులతో కలెక్టర్ సమీక్ష..

చింతలపల్లి జాన్ పీరులు లెవల్ క్రాసింగ్ ఎల్సీ63 వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులు జరుగుతున్న క్రమంలో దానికి 130 మీటర్ల పక్కనే ఇన్నర్ రింగ్ రోడ్డు వస్తున్నందున, ఇన్నర్ రింగ్ రోడ్డును ఆర్ఓబీగా మార్చినట్లయితే అన్ని వాహనాలకి సౌకర్యంగా ఉంటుందని, ట్రాఫిక్ నియంత్రణ సౌలభ్యంగా ఉంటుందనే అంశంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు.

## ఆపదలో అండ 'ఆపదమిత్ర'

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శిక్షణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆపదమిత్ర వాలంటీర్లు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బాధ్యతతో తమ సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా మడికొండ శివారులోని దుర్గభాయి మహిళా శిశు వికాస కేంద్రం ప్రాంగణంలో జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర వాలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు, ఆపద సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా కాపాడేలా ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య, మత్స్య, అగ్నిమాపక శాఖలను భాగస్వామ్యం చేస్తూ ఆ శాఖల అధికారులు సీపీఆర్ చేయడం, అగ్ని ప్రమాదాల నుంచి కాపాడడం, వరదలు సంభవించినప్పుడు ఎలా రెస్క్యూ చేస్తారనే వివరాలను తెలియజేస్తారన్నారు. వాలంటీర్లు తమ చుట్టుపక్కల సంభవించే విపత్తుల నుంచి కాపాడేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి నాగరాజు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, ఇతర ఆపద సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా కాపాడేందుకు ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆపదమిత్ర వాలంటీర్లకు 12 రోజుల పాటు ప్రకృతి విపత్తు, ఆపద సమయాలలో ఏవిధంగా కాపాడవచ్చనే వివరాలను శిక్షణ కార్యక్రమంలో తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, మెప్మా కోర్డినేటర్ రజిత రాణి, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ జయశ్రీ, తదితరులతో పాటు ఆపదమిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.





### విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన..

హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని పాత ఆర్ అండ్ బీ క్వార్టర్స్ భవన సముదాయం ఆవరణలో ప్రతిపాదిత 33/11కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్ అండ్ బీ, విద్యుత్, రెవెన్యూ అధికారులతో కలిసి కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం స్థల పరిశీలన చేశారు. స్థల విస్తీర్ణం, భవన వివరాలను ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించిన మ్యాపును కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, డీఈ సాంబరెడ్డి, రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

# బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేగంగా చేయాలి



- పంచతంత్ర థీమ్ తో పార్క్
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**వరంగల్ వాయిస్, జనగామ :** బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలో గల బతుకమ్మ కుంటను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రూ. కోటి 50 లక్షలతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ మేరకు బతుకమ్మ కుంటను పంచతంత్ర థీమ్ తో అభివృద్ధి చేయాలనీ, సుందరీకరణ నేపథ్యంలో గ్రిల్స్, కాలిబాట, గజిబోలు, లైటింగ్, వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆటస్థలం, ఆడుకునేందుకు పరికరాలు, చిన్న పార్కు ఏర్పాటుకు ప్రారంభించిన పనులను వేగవంతం చేసి, 15 రోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే కుంట పూడికతీత పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని సూచించారు. త్వరగా అభివృద్ధి పనులను పూర్తి చేసి.. పట్టణ వాసులకు బతుకమ్మ కుంటను వాడుకలోకి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మునిసిపల్ డీఈ రాజ్ కుమార్, ఏఈ మహిపాల్ పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలి

- కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరపాలక సంస్థ ఎంహెచ్ఓ రాజేష్‌కు తేలికపాటి వర్షాలు కురిసినప్పటికీ డివిజన్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని, రాబోయే వర్షకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి కోరారు. ఈ విషయాన్ని గమనించిన ఎంహెచ్ఓ రాజేష్ వెంటనే స్పందించి కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి డీకే నగర్, ఉప్పరోనికుంట, ప్రతాప్ నగర్ వంటి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాల సమయంలో ఈ ప్రాంతాల్లో నీటి ముంపు ఎలా జరుగుతుందన్న వివరాలను కార్పొరేటర్ రాజేష్‌కు వివరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లో పారిశుద్ధ్య పరిస్థితి తృప్తికరంగా లేదని, కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో శానిటేషన్ సిబ్బంది తక్కువగా ఉండటంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరారు. దీనికి స్పందించిన ఎంహెచ్ఓ రాజేష్ మాట్లాడుతూ ప్రతి శానిటేషన్ సర్కిల్‌కు ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను కేటాయించనున్నట్లు చెప్పారు. దీని ద్వారా బాక్స్ డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం సులభమవుతుందన్నారు. ఇంకా, డ్రైనేజీ లేని ప్రాంతాల్లో ఇంటి వద్ద వాడిన నీటిని బయటకు వదలకుండా ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ప్రజలకు సూచించారు. శానిటేషన్ సిబ్బంది పెంపునకు తాను అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ పరిశీలనలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్రం శ్రీను, జవాన్లు రమేష్, కృష్ణ, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి



➲ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, గీసుకొండ** : రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం గీసుగొండ మండలం అనంతారం గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ విధానంలో ఉత్పత్తి పెంచుకొని ఆదాయం పొందాలని రైతులు కాలానికి అనుగుణంగా మారాలని, పంట మార్పిడితో అత్యధిక దిగుబడి వచ్చి లాభాలు ఆర్జించవచ్చన్నారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయడం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు. నిత్యం ఫర్టిలైజర్ ఎరువులపై ఆధారపడటం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవడం వల్ల రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. ప్రతి మండలంలో 125 ఎకరాల భూమిలో సేంద్రియ వ్యవసాయం చేసి రైతులను చైతన్యం చేయబోతున్నామన్నారు. వ్యవసాయంలో నూతన సాంకేతికత ఉపయోగం పెరిగిందని, రైతులు ఆవిధంగా ఆలోచన చేయాలన్నారు. పాడి పరిశ్రమల అభివృద్ధికి తాను కృషి చేస్తున్నానని దాని ద్వారా ఎరువులు సేంద్రియ వ్యవసాయం లభ్యమవుతుందన్నారు.

# స్మోకింగ్ జోన్లు ఏర్పాటు చేయాలి



**వరంగల్ వాయిస్, జనగామ :** హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా హోటల్స్ కు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదనీ జనగామకు చెందిన న్యాయవాది రాగళ్ల శ్రీహరి ఒక ప్రకటనలో కోరారు. స్మోకింగ్ వల్ల స్మోకింగ్ చేసే వారికి కాకుండా వారి పక్కన కూర్చుని పీల్చే పొగ వల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. స్మోకింగ్ చేసే వారు దీనిని దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. కార్పొరేట్ కంపెనీలలో ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్లను ఏర్పాటు చేస్తూ ఎవరికీ అంతరాయం లేకుండా చూస్తారనీ అదే తరహాలోనే జనగామలోని అన్ని హోటల్ యజమానులకు ఫుడ్ ఇన్స్పెక్టర్, జిల్లా వైద్యాధికారి, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలనీ ఆయన కోరారు.

# ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున, రైతులు వరి ధాన్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేసుకోవాలని, మాచర్ వచ్చే వరకు టార్పాలిన్ షీట్లతో కప్పాలని ఆమె సూచించారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఆదేశించారు. రైతులు అవసరమైనప్పుడు ఉపయోగించడానికి టోల్-ఫ్రీ నంబర్ ద్వారా అధికారులను సంప్రదించాలని అన్నారు. ఈ పర్యటనలో డీఆర్డీవో పీడీ, ఆర్డీవో, జిల్లా సహకార అధికారి పౌరసరఫరాల జిల్లా అధికారులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతలకు పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జేష్ట మాసం గ్రీష్మ రుతువు తదియ బుధవారం పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతినెల నిర్వహించే పూజా కార్యక్రమాలలో భాగంగా పంచామృతాలు సరస్వతి పుష్కర జలంతో అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు నిర్వహించారు.

# వరంగల్‌లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

## ఒక్కరికి జైలు శిక్ష, పలువురికి జరిమానాలు


**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవింగ్ కేసులపై కఠిన చర్యలు తీసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీల్లో మొత్తం 18 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వీరిని మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం ముందు హాజరుపరచగా, ప్రతాప్ సింగ్ అనే వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించి, హుజురాబాద్ సబ్ జైలుకు తరలించారు. మిగతా 17 మందికి కలిపి రూ.18,300 జరిమానా విధించామని ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ తెలిపారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్సు లేకుండానే వాహనాలు నడిపిన ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి వారికి తలా రూ.1000 జరిమానా విధించారు.

## పేదల పెద్దన్న ఎన్టీఆర్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలు డోర్నకల్ లోని ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక బైపాస్ ప్రాంతంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన నాయకులు, ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు గర్వకారణంగా నిలిచారని, ఆయన సేవలు మరువలేనివన్నారు. రాష్టానికి, తెలుగు జాతికి ఎన్టీఆర్ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఎన్టీఆర్ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఎన్టీఆర్ సినీ రంగంలో అందించిన కీర్తి, రాజకీయ రంగంలో చూపిన నాయకత్వం, పేదల పట్ల చూపిన ప్రేమ, తదితర అంశాలను వేడుకల్లో ప్రస్తావించారు. ఆయన జీవితం నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బికసాని రామకృష్ణ, రావూరి మోహన్ రావు, తాళ్లూరి హనుమ, శ్రీనివాస్, నాగేశ్వర రావు, పోటు జనార్దన్, కుటుంబ రావు, మల్లయ్య, అర్జున్ సింగ్, సౌజన్ సింగ్, కోటిలింగం, మల్లేశం, ఏకాంబ్రం పాల్గొన్నారు.


## మీసేవా కేంద్రాల ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** మీసేవా కేంద్రాలు అధిక రుసుములు వసూలు చేయకూడదని ఈ జిల్లా మేనేజర్ రాజ్కుమర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు బుధవారం వరంగల్ , ఖిలావరంగల్ మండలాల్లోని మీసేవా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి మీసేవా కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవ కేంద్రాలు పారదర్శకంగా పని చేయాలని, మీసేవ కేంద్రాలు నిబంధనలు అతిక్రమించి అధికంగా వసూళ్లకు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మీసేవా కేంద్రాలలో పౌరులకు స్పష్టంగా కనిపించేలా పౌర సేవల చార్ట్‌ను స్థానిక తహశీల్దార్, ఈ జిల్లా మేనేజర్, సంప్రదింపు వివరాలను ప్రదర్శించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని, అనధికార ప్రదేశాలలో మీసేవా కేంద్రాలను నడపవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీసేవ కేంద్రాల నిర్వాహకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్రైమ్స్ ఏసీపీగా సదయ్య బాధ్యతల స్వీకరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్స్ నూతన ఏసీపీగా నియమించబడిన సదయ్య బుధవారం క్రైమ్ ఏసీపీ గా బాధ్యతలు చేపట్టారు. సీఐడీ విభాగంలో పనిచేస్తూ బదిలీపై వచ్చిన సదయ్య గతంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలో వివిధ హోదాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించారు.




## ఎన్టీఆర్ తెలుగు జాతికి చేసిన సేవలు మరువలేనివి

### టీడీపీ నేత చిలువేరు రవీందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు చిలువేరు రవీందర్ ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపకుడు, విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమంలో రవీందర్ మాట్లాడుతూ, "ప్రజలే దేవుళ్లు, సమాజమే దేవాలయం" అనే గొప్ప సిద్ధాంతంతో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ పార్టీ ఏర్పాటైన తొమ్మిది నెలలకే అధికారంలోకి వచ్చారన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక 35 రూపాయల వృద్ధాప్య పింఛన్ అందజేశారు. కిలో బియ్యాన్ని రూ.2కే అందుబాటులోకి తెచ్చారు. రైతులకు ఉచితంగా విద్యుత్ అందించారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించారు. తెలంగాణలో పోలీస్ పటేల్ వ్యవస్థను రద్దు చేసి ప్రజల పాలనను ప్రజల మధ్యకే తీసుకువచ్చారని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల రాజకీయాలలోకి ప్రవేశించేందుకు అవకాశాలు కల్పించిందని, పార్టీ ఆవిర్భావంతో తెలుగు ప్రజల్లో ఒక చైతన్యం ఏర్పడిందని చెప్పారు. ఎన్టీఆర్ చేసిన సేవలను నేడు తలచుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించామని రవీందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వల్పదాసు రాజశేఖర్, శిర బోయిన రాజు, బరిగెల సుధాకర్, సింగారపు దేవేందర్ రాజు, బజ్జూరి వీరేశం, పోలేపాక సాయి, కత్తి చందర్, మారేడు పాక హరికృష్ణ పాల్గొన్నారు.

## మావోయిస్టుల హత్యలు అన్యాయం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** శాంతి చర్చలకు ముందుకు వచ్చిన మావోయిస్టులను ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్‌కౌంటర్లలో కాల్చిచంపడం అన్యాయమని, ఇవి ప్రభుత్వ నిర్వహించిన హత్యలేనని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి సమన్వయకర్త ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం ఎదుట పౌరహక్కుల సంఘం, ప్రజా ఫ్రంట్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ, మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడుతూ, ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకపు సంఘటనగా అభివర్ణించారు. ఈ కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత సంబాల కేశవరావు సహా 26 మంది నక్సలైట్లు మరణించారని తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం దీన్ని ఘనవిజయంగా ప్రచారం చేస్తూ మావోయిస్టులను తుదముట్టిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇక, ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినవారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం వాటిని బేఖాతరు చేసి దహనం చేయడం దుర్మార్గమన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న హింసా చర్యలను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మావోయిస్టుల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను బలిపశువులుగా మార్చుతోందని ఆయన ఆరోపించారు. ఈ ఎన్‌కౌంటర్ ఘటనలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో వివిధ రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై సమావేశం




**వరంగల్ వాయిస్, జనగామ :** స్థానిక విజయ ఫంక్షన్ హాల్ లో బుధవారం "ఒకే దేశం – ఒకే ఎన్నిక" (వన్ నేషన్ వన్ ఎలక్షన్) అంశంపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ నేతృత్వంలో నిర్వహించగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు. సభలో మాట్లాడిన తివారి ఒకే దేశం – ఒకే ఎన్నిక విధానం వల్ల ఏర్పడే లాభాలపై వివరంగా చర్చించారు. ఈ విధానం వల్ల ఎన్నికల నిర్వహణపై ఖర్చు తక్కువవుతుందని, ప్రభుత్వ వనరుల పొదుపు జరిగి సమర్థవంతమైన పాలన సాధ్యమవుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే సమయంలో పని చేస్తే సమన్వయం పెరుగుతుందని, అభివృద్ధి ప్రణాళికలు వేగంగా అమలవుతాయని తెలిపారు. ఎల్లప్పుడూ ఎన్నికల వల్ల మార్కెట్లపై వచ్చే ప్రభావం తగ్గుతుందని, పెట్టుబడిదారులకు స్థిరత్వం లభిస్తుందని తెలిపారు. అలాగే, ఎన్నికల మధ్య విరామం పెరిగితే నాయకులు ప్రజల సమస్యలపై ఎక్కువ శ్రద్ధ చూపే అవకాశం ఉంటుందని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 70 ఏళ్లలో పరిష్కరించలేని సమస్యలు –ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్, వర్క్స్ సవరణ చట్టం వంటి సమస్యలు పరిష్కారమయ్యాయని ప్రశంసించారు. అంతర్జాతీయంగా భారత్ పేరు ప్రఖ్యాతులు పొందడంలో మోడీ దోహదపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మరావు, సీతారాం నాయక్, విజయ రామారావు, నందా రెడ్డి, లేగ రామ్మోహన్ రెడ్డి, కెవి ఎల్ ఎన్ రెడ్డి, పజ్జూరి లక్ష్మీ నరసయ్య, ఉడుగుల రమేష్, శశిధర్ రెడ్డి, మాచర్ల బిక్షపతి, కన్నా పర్శురాములు, చింతపండు కిరణ్, ప్రొఫెసర్ సీతారాములు దేవర ఎల్లయ్య, శ్రీమాన్ అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, నాగరాజు, పెదోజు జగదీష్, భాగాల నవీన్ రెడ్డి, రవి, సంతోష్, మహిపాల్, మహేష్, మహిళా నాయకురాలు తోకల ఉమా రాణి, స్వప్న రెడ్డి, కత్తుల లక్ష్మి, మాలతి, రెడ్డి బొమ్మకంటి అనిల్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు మే 26, 27, 28 తేదీలలో వరంగల్ సాయికన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించబడ్డాయి. మహాసభల ముగింపు రోజైన మూడవ రోజు ముఖ్య అతిథిగా హాజరైన ఎంసీపీఐ నేత మద్దిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం "ఆపరేషన్ కగారు" పేరిట ఆదివాసీలపై రాజ్యహింసను కొనసాగిస్తోందని, నక్సలైట్ల నిర్మూలన పేరుతో అమాయక భారత పౌరులను ఎటువంటి విచారణ లేకుండా కాల్చిచంపుతూ, వారి శవాలను కుటుంబాలకు అప్పగించకుండా అమానుషంగా వ్యవహరిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా ఖండించిన మహాసభలు, వెంటనే ఆపరేషన్‌ను నిలిపి శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చి, పౌరుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశాయి. ఆదివాసీలు అడవులలో ఖనిజ సంపదను దోచుకునే కార్పొరేట్ కంపెనీలకు అడ్డుగా ఉన్నందునే ఈ కుట్రపూరిత ఆపరేషన్ కొనసాగుతోందని మహాసభ అభిప్రాయపడింది. మహాసభల్లో ప్రజానాట్యమండలి కళాకారులు సంపత్ బృందం గీతాల ద్వారా ప్రతినిధులను ఆకట్టుకున్నారు. అమరులకు జేజేలు పలుకుతూ మహాసభను ఘనంగా ముగించారు. కార్యక్రమంలో ఎంసిపిఐ కేంద్ర నాయకులు మోర్తాల చంద్ర రావు, నర్ల చంద్రశేఖర్, పానుగంటి నరసయ్య, మాదం తిరుపతి, మాడిశెట్టి అరుణ్ కుమార్, తాటికొండ రవి, మాలోత్ రాజేష్ నాయక్, సంద గణేష్, భాషిపాక రమేష్, బల్చుకూరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# ట్రంప్ విధానాలతో భారత విద్యార్థులకు నష్టం



- అమెరికా అడుగులకు మడుగులొత్తుతున్న మోడీ
- మద్ది కాయల అశోక్ ఓంకార్

**వరంగల్, వరంగల్ వాయిస్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన విదేశీ విధానాలు, ముఖ్యంగా విద్యారంగంలో తీసుకున్న ఆంక్షలు భారత విద్యార్థులకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయని, అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా అడుగులకు మడుగులొత్తి వాటిని సమర్థించడం దిగజారుడుతనానికి నిదర్శనమని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ విమర్శించారు. వరంగల్‌లో గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఎంసీపీఐ(యూ) పోలిట్ బ్యూరో సమావేశాల్లో భాగంగా, ఓంకార్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం పెరుగుతున్న నేపథ్యంలో, అమెరికా తన లోపాలను దాచేందుకు యుద్ధోన్మాద విధానాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. విదేశీ విద్యార్థులపై పన్నులు, వీసా ఆంక్షలు తదితర చర్యల ద్వారా భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో భారత ప్రభుత్వం ట్రంప్ విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, మోడీ ప్రభుత్వం నిష్క్రియగా వ్యవహరిస్తోందని, దాంతో దేశానికి తీరని నష్టం కలుగుతోందని మండిపడ్డారు. అంతేకాకుండా, దేశంలో పెరిగిపోతున్న ఆకలి, దారిద్ర్యం, నేరాలపైన ప్రభుత్వం శ్రద్ధ చూపకుండా, మావోయిస్టులపై "ఆపరేషన్ కగార్" పేరిట అమానుషంగా దాడులు చేయడాన్ని అశోక్ ఓంకార్ తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో వామపక్ష, కమ్యూనిస్టు శక్తుల ఐక్యతకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇప్పటికే కొన్ని కమ్యూనిస్టు పార్టీలతో ఏకీకరణ చర్చలు ముగిసినట్లు తెలిపారు. ప్రజా వ్యతిరేక బీజేపీ–మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఇక, పోలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కిరణ్ జిత్ సింగ్ శేఖాన్ మాట్లాడుతూ, ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చారిత్రాత్మక రైతాంగ ఉద్యమం మోడీ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పిందన్నారు. రైతు సంఘాలు ఇలాంటి ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలనీ, రాజకీయాలకతీతంగా రైతు వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, పోలిట్ బ్యూరో సభ్యులు మహేంద్ర నేహా, అనుభవ్ దాస్ శాస్త్రి, కాటం నాగభూషణం, వల్లెపు ఉపేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, ఎన్. రెడ్డి, హంసా రెడ్డి, మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, నాయకులు అప్పరపురి నరసయ్య, మాలి ప్రభాకర్, మల్లికార్జున్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా చేస్తే.. చూస్తూ ఊరుకోం

- వీఆర్వోే, వీఆర్ఏ సంఘాల హెచ్చరిక

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని దామెర చెరువు పక్కన ఉన్న వీఆర్వో, వీఆర్ఏలకు చెందిన స్థలంపై అక్రమ కబ్జా యత్నాలను తాము సహించబోమని వీఆర్వో, వీఆర్ఏ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. మాదారం శివారులోని సర్వే నంబర్ 69 లో ఉన్న 1 ఎకరం 19 గుంటల భూమిని 1969లో పట్వారీలు కలిసి ఉమ్మడిగా కొనుగోలు చేశారని, అప్పటి నుంచి ఈ భూమి తమ ఆధీనంలోనే ఉందని చెప్పారు. ఈ భూమిని కాపాడుకోవడానికి తాము ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని, గతంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నిర్మాణాలు చేపట్టినపుడు కూడా ఆ యత్నాన్ని అడ్డుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ఒక కాంట్రాక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆ స్థలంలో అక్రమంగా మొరం పోసిపోతున్నారని, ఈ విషయం కాంట్రాక్టర్ సూపర్ వైజర్ నుంచే తెలుసుకున్నామని వారు పేర్కొన్నారు. ఈ భూమిపై వీఆర్వో, వీఆర్ఏల పేరిటే రిజిస్ట్రేషన్ 1969–70 కాలంలో జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు తమ హక్కుగా కొనసాగుతోందని వాఖ్యానించారు.



పరకాల, శాయంపేట, మొగుళ్లపల్లి, భూపాలపల్లి, రేగొండ, చిట్యాల మండలాలకు చెందిన సుమారు 650 మంది వీఆర్వో, వీఆర్ఏలు కలిసికట్టుగా కొన్ని దశాబ్దాల పాటు ఈ భూమిని కాపాడుకుంటూ వచ్చామని, ఎన్నో యత్నాలను తిప్పికొట్టామని సంఘం నాయకులు తెలిపారు. తాజాగా జరుగుతున్న అక్రమ తవ్వకాలను తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, తమ స్థలాన్ని కాపాడుకునే ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాలకు చెందిన వీఆర్వో, వీఆర్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్కూళ్ల బలోపేతంలో టీఎస్‌యూటీఎఫ్ కృషి ప్రశంసనీయం

- డీఈవో డాక్టర్ రవీందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల నమోదు శాతం పెంచడంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) అద్భుతంగా కృషి చేస్తోందని మానుకోట జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి ప్రశంసించారు. స్థానిక ఏకశిల పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచార జాతా కార్యక్రమ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "హక్కుల కోసం పోరాడటమే కాకుండా, బడి మనదే – బాధ్యత మనదే అనే నినాదంతో టీఎస్‌యూటీఎఫ్ చేపట్టిన ఈ ప్రచారం అభినందనీయన్నారు. జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ మాట్లాడుతూ, టీఎస్‌యూటీఎఫ్ గత పదేళ్లుగా అనేక పోరాటాలు జరిపిన ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. "మన పిల్లలను మన ఊరి



బడిలో చేర్పించి, అవసరమైన వసతుల కల్పన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తే బడి నిలబడుతుంది. విద్యార్థుల నమోదు పెంపు, తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంపు కోసం బడిబాట ప్రచార జాతాను విజయవంతం చేయాలి" అని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు హుస్సేన్, హరినాయక్, రమేష్, మండలాల బాధ్యులు ప్రవీణ్ కుమార్, ఎం. అబ్దుల్ అజీజ్, సుందర్ కుమార్, వెంకన్న, బిక్షపతి, కలపాల అనిత, పార్వతి, హజ్రా, శంకర్, వీరస్వామి, రాములు, సాహెబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ శాఖ అధ్యక్షుడిగా మారేపల్లి రాజు నియామకం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట గ్రామ శాఖ అధ్యక్ష పదవికి మారేపల్లి రాజును నియమించినట్లు పార్టీ పరిశీలకులు కొమ్ముల భాస్కర్, మామిడిపల్లి సాంబయ్య తెలిపారు. బుధవారం శాయంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ నియామకాలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఇతర పదవులకు కూడా నియామకాలు చేపట్టారు. ప్రధాన కార్యదర్శిగా మామిడి సుదర్శన్, ఉపాధ్యక్షులుగా కోల శ్రీనివాస్, భాషని చంద్రమౌళి, సహాయ కార్యదర్శిగా బెల్లపెల్లి సదానందం, కోశాధికారిగా ఆలే శంకర్, వలపదాసు వెంకటరమణలను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, నాయకులు భాషని మార్కండేయ, మాదిరెడ్డి ప్రపంచరెడ్డి, మారేపల్లి కటయ్య, దామర కొండ కొమురయ్య, వడ్డేపల్లి శ్రీనివాస్, భాషని రవి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల పట్టణానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి చెక్కులను పరకాల నియోజకవర్గ శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతనంగా వివాహం చేసుకున్న జంటలకు కల్యాణ లక్ష్మి పథకం ఒక వరంగా ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, పార్టీలకు అతీతంగా కల్యాణ లక్ష్మి ఇవ్వడం ఎంతో గొప్ప కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల, నడికూడ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, బుర్ర దేవేందర్ గౌడ్, పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, శ్రీ కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కొలుగురి రాజేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్ పర్నెం మల్లారెడ్డి, కోతపెల్లి రవి, చాడ తిరుపతి రెడ్డి, ఎస్సీ విభాగం అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, ఏఎంసీ డైరెక్టర్ దాసరి భిక్షపతి, పరకాల పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద నాగరాజు, ఏజీపీ లక్కం శంకర్, కాంగ్రెస్ నాయకులు ఎకు రవికుమార్, ఎండీ షఫీ, గోవింద సురేష్ పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని పెంచికలపేట గ్రామానికి చెందిన కందకట్ల శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ వార్త తెలిసిన బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు శంకరయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మృతి వెనుక ఉన్న కారణాలు తెలుసుకొని, కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. తదుపరి, వారికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుci ముత్యాల శ్రీనివాస్ గౌడ్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సముద్రాల రవి, మాజీ అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఏదులాపురం శ్రవణ్ కుమార్, మాజీ ఎంపిటిసి బయ్య పైడి, మానగాని శంకర్, పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, పూజారి రవీందర్, పీసాల సాంబయ్య, అల్లే మహేందర్, చేనేత సెల్ మండల కన్వీనర్ కందకట్ల సదానందం, యాద కుమార్, కోరె కుమారస్వామి, మూరె రాజేశ్వరరావు, బొల్లికొండ వెంకటేశ్వర్లు, మంగ మల్లికార్జున్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వంద రోజుల్లో సబ్ స్టేషన్ నిర్మాణం

◆ కాంగ్రెస్ పార్టీ అంటేనే సంక్షేమం, అభివృద్ధి
◆ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలంలోని కుర్చపల్లి గ్రామంలో 33/11 కె.వి. సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతును రాజుగా చూడాలనే దృక్పథంతో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పలు కీలక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే 20 లక్షల రైతు కుటుంబాలకు 21,000 కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం ఇదే మొదటిసారి అని చెప్పారు. కుర్చపల్లిలో నిర్మించనున్న సబ్‌స్టేషన్ వల్ల స్థానిక గ్రామాలకు గృహ, వ్యవసాయ అవసరాల నిమిత్తం నిరవధికంగా విద్యుత్ అందుబాటులో ఉంటుందని వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన వేలాది కోట్ల అప్పులను భరిస్తూనే కాంగ్రెస్



ప్రభుత్వం పేదలకు, రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నదన్నారు. డబుల్ బెడ్ రూం పథకాన్ని గత ప్రభుత్వం ప్రజలను మోసం చేయడానికి వాడుకుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తుందని హామీ ఇచ్చారు. కుర్చపల్లిలో మరో 20 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని చెప్పారు. అలాగే గ్రామంలో రూ.60 లక్షలతో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా, తెలంగాణలో పేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతోందని, దీనివల్ల ప్రతి పేద కుటుంబానికి కడుపునిండా అన్నం లభిస్తుందని చెప్పారు. ఎంపీ నిధుల ద్వారా మహిళల కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మల్లన్న సాగర్ నుంచి కుర్చపల్లికి సాగునీటి కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయని, వర్షాకాలానికి ముందే చెరువులు, కుంటలు నింపి ప్రతి పంటకు నీరు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, ఎమ్మార్వో, ఎంపీడీవో, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన వరి ధాన్యాన్నికొనుగోలు చేయాలి

● బీజేపీ నేతల డిమాండ్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని పెంచికలపేట పీఏసీఎస్ పరిధిలో ఉన్న రైతు కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కాంటాలు వేసిన తర్వాత కూడా లారీలు పంపక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసి బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ బృందం అక్కడికి చేరుకుంది. ఈ సందర్భంగా పరకాల బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, రైతుల తడిసిన వడ్లను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, లేదంటే భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాంటాలు వేసి అయిదు రోజులు గడిచినా లారీలు పంపక రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెండు మూడు రోజులలో ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని, లేకపోతే బీజేపీ రైతుల తరఫున పెద్దఎత్తున ఉద్యమానికి దిగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణు గౌడ్, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, జిల్లా నాయకులు సముద్రాల రవి, ఎదులాపురం శ్రవణ్ కుమార్, భయ్యా పైడి, నాయినేని అమరేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మానగాని శంకర్, పూజారి రవీందర్, పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, పీసాల సాంబయ్య, మోరె రాజేశ్వరరావు, అల్లే మహేందర్, బొల్లికొండ వెంకటేశ్వర్లు, రాచర్ల నరేష్, పోగుల యాదగిరి, యాద కుమార్, వేల్పుగొండ రవి, బత్తిని వీరస్వామి, వజ్ర రవికుమార్, లకిడె నాగరాజు, మాదిరెడ్డి సురేందర్, కుక్కమూడి కిరణ్, నకినబోయిన రమేష్, వాడికారి రాజు, నకాతి యుగంధర్, మంగ మల్లికార్జున్, గోనే రాజకుమార్, కనుగుల రామ్మోహన్, కోరె కుమారస్వామి పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

➲ ప్రభుత్వం చొరవ చూపాలి
➲ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో ప్రభుత్వం కీలకపాత్ర వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రైవేటు కంపెనీలకు లైసెన్సులు మంజూరు చేసి వాటి ద్వారా విత్తనాల అమ్మకాన్ని ప్రోత్సహించడం వల్ల నకిలీ విత్తనాల వ్యాప్తి పెరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ స్టేషన్ రోడ్డులో రైతులకు విత్తనాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు, సూచనలు అందించే కరపత్రాలు, ప్రచార పెక్సీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య మాట్లాడుతూ ప్రైవేటు వ్యాపారులు రైతులకు ఇష్టానుసారంగా విత్తనాలను విక్రయిస్తున్నారని, దీనివల్ల రైతులు ఏ విత్తనం కొనాలో, ఏది కొనకూడదో తెలియక అయోమయ స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అనేక ప్రైవేట్ కంపెనీలకు అనుమతులు ఇచ్చి, నియంత్రణ లేకుండా విస్తృతంగా విత్తనాలను విక్రయించడాన్ని ఆయన తప్పుబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విత్తనాలపై చట్టం తీసుకురావాలన్న డిమాండ్ ఈ సందర్భంగా వక్తలు చేశారు. విత్తనాలపై అనుమానం లేదా అభ్యంతరాలుంటే సంఘ అధ్యక్ష కార్యదర్శుల సెల్ నంబర్ 9989614974 ను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కోశాధికారి చర్ల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు సమ్మరావు, రైతులు కురిసెట్టి అశోక్, బరపటి రామ్మూర్తి, రాజు, సారయ్య తదితరులు పాల్గొన్నారు.




# చిలుక ప్రవీణ్ పై చర్యలను తీసుకోండి

## ఏసీపీకి మైనారిటీ నాయకుల వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రవక్త మహ్మద్ (సల్లల్లాహు అలైహివసల్లం)పై అవమానకర వ్యాఖ్యలు చేసి మత సామరస్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసిన యూట్యూబర్ చిలుకూరి ప్రవీణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మైనారిటీ నాయకులు మంగళవారం హనుమకొండ ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మీర్జా అజీజ్ ఉల్లా బేగ్, మాజీ కార్పొరేటర్ అబూబకర్, ముస్లిం నాయకులు ఏసీపీ నర్సింగ రావును కలిసి తన వ్యాఖ్యల ద్వారా ప్రవీణ్ మత విశ్వాసాలను అవమానించడమే కాకుండా, మత విద్వేషాన్ని రెచ్చగొట్టే దురుద్దేశంతో వ్యవహరించారని తెలిపారు. ఇది కేవలం దైవదూషణ మాత్రమే కాకుండా, సామాజిక శాంతిని భంగపరిచే చర్యగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఫిర్యాదులో మైనారిటీ నేతలు బాబాయ్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ బాకీ, నసీం జా, హరి సింగ్ తదితరులు కూడా పాల్గొన్నారు.

# శ్యామలరావు మృతి నాటక రంగానికి తీరని లోటు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నాటక రంగంపై శతపతి శ్యామలరావుకు అపారమైన ఆసక్తి ఉందని, అనారోగ్యంతో బాధపడుతున్నా తన ప్రాణాలను లెక్కచేయకుండా ఇటీవలే ఒక నాటికకు దర్శకత్వం వహించారని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి పేర్కొన్నారు. ఇది ఆయన నాటక రంగం పట్ల ఉన్న అభిమానం, నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. శ్యామలరావు నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ, కొత్త కళాకారులను ప్రోత్సహించడంతో పాటు, ఉత్సవాలలో పాల్గొన్న ప్రజలకు వినోదాన్ని అందించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని రవి గుర్తు చేశారు. అలాగే, శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా చేరిన శ్యామలరావు తరువాత యూడీసీ స్థాయికి ఎదిగి, అనేక మంది విద్యార్థులకు ప్రైవేట్ క్లాసులు చెప్పి విద్యాబోధన చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ విద్యార్థులలో చాలామంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. శతపతి శ్యామలరావు గారి అకాల మరణం పట్ల దుఃఖం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రణవ్



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** చెప్పిన మాటకంటే చేసే పనిలోనే ముందుంటారనే విషయాన్ని మరోసారి నిరూపించారు హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. జమ్మికుంట మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో జరిగిన తాజా ఘటన దీనికి నిదర్శనం. గ్రామంలోని శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయానికి వచ్చిన సమయంలో ఆలయ కమిటీ సభ్యులు బోర్ మోటార్ పాడైందని ప్రణవ్‌కు తెలియజేశారు. దీనిని గమనించిన ఆయన, వెంటనే స్పందించి ఇచ్చిన మాట ప్రకారం దేవాలయానికి రూ.30,000 విలువ చేసే కొత్త బోర్ మోటార్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రణవ్‌కి ధన్యవాదాలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయినేని రాజేశ్వర్ రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు బాపురావ్, ఆలయ కమిటీ చైర్మన్ దుగ్గినాల రవీందర్, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్ రావు, వైస్ చైర్మన్ తూముల తిరుపతి రావు, కోశాధికారి రాజు, సభ్యులు పొనగంటి రాజేశ్వర్ రావు, ఆవిరినేని రవీందర్ రావు, నాయినేని రాజేశ్వర్ రావు, కంకట రాజశేఖర్, ముక్కిడి మహేందర్, గుజ్జ కిరణ్ రావు, వెంగల్ రావు, రాజేశ్వర్ రావు, లింగంపల్లి రాజు, గాజ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





గడ్డం
కేశవమూర్తి

# మృదుస్వభావి.. మురళీధర్ రెడ్డి

- యువ అధికారులకు స్ఫూర్తి ప్రదాత
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బహుముఖ సేవలు
- సంఘ సేవకుడే కాదు.. మంచి సంస్కర్త
- టీఎన్జీఓ, టీజీఓలో కీలక పాత్ర
- గెజిటెడ్ అధికారుల సమస్యల సాధనకు కృషి
- 29న ఆత్మీయ సన్మానం
- 31న ఉద్యోగ విరమణ


**ఆయన మృదుస్వభావి.. నిగర్వి, సౌమ్యుడు కూడా! తలపెట్టిన పనిని ఆరు నూరైనా పూర్తి చేస్తారు. చక్కని ప్లానింగ్ అంతకంటే చక్కగా అమలు చేసే నైపుణ్యం ఆయన సొంతం. ఏ హోదాలో పనిచేసినా.. ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న ఆయనే.. హనుమకొండ జిల్లా మైనార్టీస్ వెల్ఫేర్ ఆఫీసర్ దాసరి మురళీధర్ రెడ్డి. ఆయన సంఘ సేవకుడే కాదు.. మంచి సంస్కర్త కూడా! ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే.. మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నారు.**

హనుమకొండ జిల్లాలో ముస్లిం మైనార్టీలకు సేవలందిస్తున్న ఆయన యువ అధికారులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. వివిధ స్థాయిల్లో మూడున్నర దశాబ్దాల పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బహుముఖ సేవలు అందించిన ఆయన ఎందరికో ఆదర్శం. అయితే ఈ నెల 31న ఉద్యోగ విమరణ చేయనున్న దాసరి మురళీధర్ రెడ్డిని టీజీఓ ఆధర్యంలో 29 న మయూరి గార్డెన్ లో ఘనంగా సన్మానించనున్నారు.

## బాల్యం

దాసరి మురళీధర్ రెడ్డి 1964 మే 29న నాటి ఉమ్మడి వరంగల్ జిల్లా, నేటి సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్దనూరులో దాసరి కృష్ణమ్మ, లక్ష్మారెడ్డి దంపతులకు జన్మించారు. తల్లి గృహిణి కాగా, తండ్రి ప్యానల్ గ్రిడ్ హెడ్మాస్టర్ గా విశిష్ట సేవలు అందించారు. ఆయనకు అన్నయ్య మేఘనాథ్ రెడ్డి, చెల్లెలు విజయభారతి ఉన్నారు. 1993 ఏప్రిల్ 15న నిర్మల్ జిల్లా మామడ మండలం కమాల్ కోటుకు చెందిన ఉన్నత విద్యావంతురాలు శైలజను ఆయన వివాహం చేసుకున్నారు. రచన శుక్తిజా రెడ్డి, కోవిదరెడ్డి వీరి సంతానం. మాస్టర్స్ పూర్తి చేసిన వీరు అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు.





## విద్యాభ్యాసం

దాసరి మురళీధర్ రెడ్డి ప్రాథమిక విద్య స్వగ్రామంలో సాగింది. ఒకటో తరగతి నుంచి 4వ తరగతి వరకు లద్నూర్ ప్రాథమిక పాఠశాలలో, ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు చేర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఎంఏ, ఎమ్మెస్సీతో పాటు పలు పీజీ డిప్లమా కోర్సులను ఆయన పూర్తి చేశారు. పశ్చిమ బెంగాల్లోని బెరహంపూర్, తమిళనాడులోని చిదంబరంలలో కూడా మురళీధర్ రెడ్డి ఉన్నత విద్యను అభ్యసించారు.

## ఉద్యోగ ప్రస్థానం

ఉన్నత చదువులు పూర్తికాగానే మురళీధర్ రెడ్డి పట్టు పరిశ్రమల శాఖలో ప్రభుత్వ ఉద్యోగ సాధించారు. 1988 మార్చి 10న అసిస్టెంట్ సెరికల్చర్ ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టి వరంగల్, హైదరాబాద్ లలో పనిచేశారు. 1991లో సెరికల్చర్ ఆఫీసర్ గా పదోన్నతి పొంది ఎల్కతుర్తి, వరంగల్ లో సేవలందించారు. ఏఓ, డీపీఎం, ఏపీఓ, ఏపీడీగా ఉమ్మడి వరంగల్ డీఆర్డీఏలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. 2015లో అసిస్టెంట్ డైరెక్టర్ గా, 2020లో డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొంది వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో పట్టు పరిశ్రమ శాఖలో ఉన్నత ఉద్యోగిగా విశిష్ట సేవలు అందించారు. 2023లో జాయింట్ డైరెక్టర్ గా పదోన్నతి పొంది హైదరాబాదులోని టీజీ టీపీసీలో జనరల్ మేనేజర్ గా ఏడాది పాటు పనిచేశారు. 2024 అక్టోబర్ 27 నుంచి హనుమకొండ జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ గా సేవలందిస్తున్నారు. మురళీధర్ రెడ్డి ఏ జిల్లాలో పనిచేసినా ప్రజల మన్ననలు పొందారు. పట్టు పరిశ్రమ విత్తన క్షేత్రాలు అభివృద్ధి చేశారు. రైతులకు సరైన సలహాలు, సూచనలిచ్చి వారిని అన్ని విధాల ప్రోత్సహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహిళా సంఘాలను అభివృద్ధిపరిచిన ఆయన, బ్యాంకు లింకేజీతో వారికి జీవనోపాధి కల్పించారు.



## యూనియన్ లో చురుగ్గా..

1990లో టీఎన్జీఓలో సభ్యుడిగా చేరిన మురళీధర్ రెడ్డి ఆ యూనియన్ లో ఎలాంటి పదవులు స్వీకరించలేదు.2010లో టీజీఓ ఉమ్మడి వరంగల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. 2016లో వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా నియామకమైన ఆయన 2023 వరకు అన్ని ప్రభుత్వ శాఖల గెజిటెడ్ అధికారుల సంక్షేమానికి పాటుపడ్డారు. ఆ తర్వాత టీజీఓ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీజీఓ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్మోహనరావు, రాష్ట్ర, జిల్లా స్థాయి నేతల సలహాలు, సూచనలు పాటిస్తూ ప్రభుత్వ గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

## సేవాపథంలో

ప్రజా ప్రతినిధులే కాదు అధికారులు, ప్రజల మన్ననలు పొందిన దాసరి మురళీధర్ రెడ్డి సేవా పథంలో ముందున్నారు. స్వర్గీయ తల్లిదండ్రులు దాసరి కృష్ణమ్మ, లక్ష్మారెడ్డిల స్మారకార్థం పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులు పంపిణీ చేస్తున్నారు. అందరితో స్నేహ సంబంధాలను కొనసాగించే ఆయన పేదలకు సహాయ సహకారాలు అందించడంలో ముందున్నారు. పుట్టి పెరిగిన లద్నూర్ లో స్కూల్ పిల్లలకు తోచిన సహాయాలు చేస్తున్నారు. అలాగే గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి హితోధిక సహాయం చేశారు. ప్రస్తుతం హనుమకొండలో స్థిరనివాసం ఉంటున్న ఆయన నివసిస్తున్న విజయపాల్ కాలనీ అభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తున్నారు.









## అవార్డులు- సత్కారాలు

ప్రజా సంక్షేమమే పరమావధిగా ఉత్తమ సేవలందిస్తున్న దాసరి మురళీధర్ రెడ్డి రాష్ట్ర మంత్రులు, వివిధ జిల్లాల కలెక్టర్ల ద్వారా పలుమార్లు జిల్లా ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రాలు పొందారు. ఇప్పటివరకు 12 సార్లు డిస్ట్రిక్ట్ బెస్ట్ ఆఫీసర్ గా సత్కారాలు అందుకున్నారు. 2020లో పట్టు పరిశ్రమ శాఖ రాష్ట్ర అధికారుల చేత ఉత్తమ పనితీరు అవార్డును పొందారు. అలాగే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల నుంచి పలుమార్లు ప్రశంసలు, సత్కారాలు పొందారు. టీఎన్జీఓ, టీజీఓలో కూడా మురళీధర్ రెడ్డి పలుమార్లు సన్మానాలు పొందారు. వివిధ సందర్భాల్లో సత్కారాలు స్వీకరించారు.



# ‘పశ్చిమ’కు మరో మణిహారం

- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం
- జీఓ విడుదల చేసిన ప్రభుత్వం
- ఏతుల ప్రభుత్వానికి చేతల ప్రభుత్వానికి తేడా సుస్పష్టం
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- సీఎం, డిప్యూటీ సీఎం చిత్ర పటాలకు క్షీరాభిషేకం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యాసిగలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం మరో మైలురాయి దాటిందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం జీఓ విడుదల చేయడం శుభ పరిణామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి జిల్లా, నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ విద్యావ్యవస్థ పటిష్టంగా ఉన్న నగరంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయడం ద్వారా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం విద్యా హబ్ గా మారనుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య అందించేందుకు రూ.4000 కోట్లతో 20 కొత్త ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. హనుమకొండ చరిత్రలో ఇది సువర్ణాధ్యాయం అని పేర్కొన్నారు.



### ఒకే రోజు మూడు జీఓలు..

గతంలో జరగని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రజాప్రభుత్వంలో జరుగుతున్నాయని నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. మెడికల్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. చరిత్రలో ఎన్నడూ జరగని భద్రఖాళి అమ్మవారి మాడవీధులు, చెరువు ప్రక్షాళన పనులు కాంగ్రెస్ సర్కార్ లో జరుగుతున్నాయన్నారు. నిన్న ఒక్కరోజే పశ్చిమ నియోజవర్గంలో కీలక అభివృద్ధి పనులకు మూడు జీఓలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రానున్న రోజుల్లో మీడియా ముందుకు వాటిని తీసుకువస్తానన్నారు.

### ఈకలు పీకే పనిలో ప్రతిపక్షాలు..

నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న తరుణంలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలకు కొద్దిపాటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అయినప్పటికీ వారికి కూడా అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. కొడిగుడ్డుమీదా ఈకలు పీకే పనిలో ప్రతిపక్ష నాయకులు ఉన్నారని ఆయన ఆరోపించారు. చిన్న చిన్న అంశాలను పెద్దదిగా చూపుతూ అభివృద్ధికి ఆటంకులుగా మారారని మండిపడ్డారు. గతంలో చిరు వ్యాపారుల కోసం షట్టర్ ఏర్పాటు చేసి కేవలం మీ బినామీలకు ఇచ్చుకున్నది వాస్తవం కదా అని ప్రశ్నించారు. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో నష్టపోతున్న చిరు వ్యాపారాలకు వేజ్ అండ్ నాన్ వెజ్ కాంప్లెక్స్ లో అవకాశాలు కల్పిస్తానని మీడియా ముఖంగా భరోసా కల్పించారు. ప్రజలు పదేళ్లు పట్టం కడితే కనీస అభివృద్ధి చేయని మీరు నేడు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 15 నెలల్లో జరిగిన ప్రతి అభివృద్ధిపై క్యాలెండర్ విడుదల చేస్తానని మీకు చిత్తశుద్ధి ఉంటే చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

### క్షీరాభిషేకం..

అనంతరం స్థానిక నేతలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్ర పటాలకు నాయిని రాజేందర్ రెడ్డి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, బ్లాక్ అధ్యక్షులు లక్ష్మా రెడ్డి, సంపత్ యాదవ్, అంబేద్కర్, రాజు, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# శుభపరిణామం

- మేడిగడ్డ మరమ్మత్తులకు ప్రభుత్వం నిర్ణయం
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మేడిగడ్డ ప్రాజెక్ట్ రిపేర్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదుకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించడం శుభపరినామం అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బోయినపల్లి మాట్లాడుతూ మేడిగడ్డ ప్రాజెక్టు రిపేర్ చేయడానికి ఎన్డీఎస్ఏ రిపోర్ట్ అవసరం లేదని తను ఇది వరకే చెప్పినట్లు గుర్తు చేశారు. ఎన్డీఎస్ఏ సైతం మేడిగడ్డ ప్రాజెక్టు రిపేర్ విషయంలో రాష్ట్ర రభుత్వమే ఆలోచించి డిజైన్ చేయాలని చెప్పిందన్నారు. మేడి గడ్డ మరమ్మత్తులకు సంబంధించి పాండ్యా నేతృత్వంలో రిపేర్ చేయడానికి కమిటి వేయడం సంతోషంగా ఉందన్నారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా మరమ్మత్తులు చేపట్టాలన్నారు. మేడిగడ్డ వద్ద నీటిని నిలువ చేయకపోవడంతో ఆ నీరంతా సముద్రం పాలు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు కూడా ఏమీ కాలేదన్నారు.



# కాంట్రాక్టర్ పై మేయర్ ఆగ్రహం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పోతన రోడ్డు ప్రాంతంలో స్మార్ట్ సిటీ పనులు చేపట్టగా వచ్చిన మట్టి కుప్పలను తొలగించకుండా నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ పై నగర మేయర్ గుండు సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నగర మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 29 వ డివిజన్ లోని పోతన రోడ్ తో పాటు 28 వ డివిజన్ లోని గల డ్రైన్ లను ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమర్ధవంతంగా చేపట్టుటకు మేయర్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రవి కుమార్, టీపీఎస్ లు యెర్నాద్ శ్రీకాంత్, ఏఈలు రాగి శ్రీకాంత్, మొజామిల్, హబీబ్ సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్ స్పెక్టర్ శ్యామ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# టాలెంట్ ఎవరి సొత్తు కాదు

- చీకటి జీవితాల్లో వెలుగులు నింపేది చదువు ఒక్కటే
- అంబేద్కర్ అందించిన గొప్ప వరం రాజ్యాంగం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** టాలెంట్ ఎవరి సొత్తు కాదని, కష్ట పడి చదివితే ప్రతీ ఒక్కరు విజయం సాధించవచ్చని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్ లోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్ లో బుధవారం ఏర్పాటు చేసిన గురుకుల అవార్డుల ప్రధాన ఉత్సవం కార్యక్రమంలో డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. చీకట్లు కమ్ముకున్న పేద బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేది చదువు ఒకటే అన్నారు. అంబేద్కర్ అందించిన గొప్ప వరం రాజ్యాంగం అని గుర్తు చేశారు. అంబేద్కర్ చెప్పిన పే బ్యాక్ టూ సొసైటీని ప్రతి ఒక్క విద్యార్థి పాటించాలన్నారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రతి ఒక్కరు తిరిగి సమాజంలోని అన్ని వర్గాల



ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వంలోని విద్యా వ్యవస్థకు బ్రాండ్ అంబాసిడర్ గా విద్యార్థులు నిలవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో 55 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను రూ.11 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. టార్గెట్ యాక్షన్ ప్లాన్ తోనే గమ్యానికి చేరుకోవాలని అన్నారు. దళిత బహుజన మేధావులను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి జీవితంలో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం సమాజంలో ఉన్న అతిపెద్ద మహమ్మారి డ్రగ్స్ అన్నారు. ప్రస్తుత కాలంలో మాదకద్రవ్యాలు పాఠశాలల్లోకి ప్రవేశించాయన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మీ చుట్టూ ఉన్నవారు మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే వారిని అందులో నుంచి బయటపడే విధంగా విద్యార్థులు మీ వంతు సహాయం అందించాలన్నారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు కష్టపడి చదవాలన్నారు. గొప్ప పేరు తెచ్చుకొని తల్లిదండ్రులకు, రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని అన్నారు.

# వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్

- నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రకటించారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖతోపాటు గత పార్లమెంట్ సమావేశాల్లో సైతం వరంగల్ లో వెల్ నెస్ ఏర్పాటు చేయాలని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లినట్లు కావ్యవ వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ త్వరలోనే వరంగల్ సెంటర్ ఏర్పాటు చేయడానికి సుముఖత చూపిందన్నారు. వరంగల్‌తో సహా దేశ వ్యాప్తంగా 22 కొత్త సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించేందుకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపినట్లు అదనపు కార్యదర్శి పోలీ సింగ్ లేఖ రాశారన్నారు. ఈ సెంటర్లలో అవసరమైన పోస్టుల భర్తీకి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) నుంచి ఆమోదం లభించిందని ఆ లేఖలో పేర్కొన్నట్లు వెల్లడించారు. అయితే, ఈ ప్రతిపాదనను ఆర్థిక అనుమతి కోసం ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపగా కొన్ని సవరణలు కోరుతూ ఫైల్ రిటర్న్ పంపారన్నారు. ప్రస్తుతం ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ సవరణలపై పనిచేస్తోందన్నారు. వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా వైద్య చికిత్సలు, వ్యాధి నిర్ధారణ తదితర సదుపాయాలు కలగడంతో ఉద్యోగులకు, పెన్షనర్లకు ఉద్యోగ కుటుంబాలకు వైద్య ఆరోగ్య సంబంధిత సౌకర్యం లభిస్తుందని తెలిపానేజ జిల్లాలో వెల్ నెస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com